

# చావు తప్పితే చాలు...
## డిటెక్టివ్ యుగంధర్ పరిశోధన
### కొమ్మూరి సాంబశివరావు రచన



47 సంవత్సరాల క్రిందట విడుదలైన ఈ నవల ఆ రోజుల్లో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1962 నుంచీ 1976 వరకూ మూడు సార్లు పునర్ముద్రించబడింది. దాదాపు 15,000 కాపీలు పైగా అమ్ముడుపోయాయి ఆ రోజుల్లోనే. ఈ నవల పుస్తకం వెనుక నున్న క్రింది వాక్యాలు నవల పట్ల ఉత్కంఠతని రెట్టింపు చేస్తాయి.

***

భారతి భుజాల మీద ఏదో చేతులు వేసింది. మొహానికి ఏదో రాసుకుంది? ఏమిటది?

మెట్లమీద ప్రసాద్ చూసిన ఆకారం ఏమిటి? మనిషి కాదని నిశ్చయంగా ఎందుకన్నాడు? వైకుంఠరావు చనిపోయి రెండు రోజులైంది. అతని శవం, మేడమీద కుర్చీలో ఎట్లా ఉంది? ఇంట్లో ఎట్లా తిరుగుతోంది?

"దూరంగా పొండి, తలుపు దగ్గరకి వెళ్ళకండి" అని అరుస్తూ భారతి ప్రసాద్‌నీ, శేఖర్‌నీ ఎందుకు వెనక్కి లాగింది.?

ఈ పుస్తకం రాత్రిళ్ళు ముట్టుకోవద్దు. ఒంటరిగా ఉన్నప్పుడు చదవొద్దు. భయం వేసినప్పుడు అప్పటికి చదవడం ఆపి కొంతసేపటి తర్వాత మళ్ళీ మొదలుపెట్టండి..!

(తెలుగులో మొట్టమొదటి హారర్ ఫిక్షన్ నవల ఇది . మొదటి ముద్రణ: 1962లో)




(క్రిందటి సంచిక నుంచీ తరువాయి)

## 10

అద్దం ముందు నిలుచుని కోల్డ్క్రీం చెంపలకి పూసుకుంటూ తనని తను శ్రద్ధగా చూసుకుంటోంది పద్మ. చిన్నగా నవ్వుకుంది. తను అందమైనది. అద్దం అబద్ధం చెప్పదు. ఉన్నది ఉన్నట్లు చూపిస్తుంది. జడ నడుం కిందకి పడుతోంది అద్దానికి కొంచెం దూరం జరిగిన తన ప్రతిబింబం చూసుకుంది - సన్నని నడుం, సన్నగా వున్న శరీరం, పద్మ తృప్తిగా నవ్వుకుంది. విదేశాలకి వెళ్ళిన తర్వాత శేఖర్ బాగా మారిపోయి ఉంటాడు. తను చూసి మూడేళ్ళయింది. విమానాశ్రయానికి వెళుతూ చూడడానికి తను ఇంటికి వచ్చాడు. అప్పుడు తనని చూసి 'చూస్తూవుండగా చాలా పెద్దదానివయ్యావే!' అన్నాడు.

తను చీర కట్టడం అతను చూడడం అదే మొదటిసారి.

చిన్నప్పట్నించీ చాలా చనువుగా ఉండేవాళ్ళు తను సెకండు ఫారం చదువుతున్నప్పుడు శేఖర్ తనకి లెక్కలు చెప్పేవాడు. తను తప్పు చేస్తే రెండు చెవులూ పట్టుకుని, పుస్తకం మీదకి వంచి 'సరిగా చూసి చెయ్యి!' అనేవాడు. కోపంతో కాదు - నవ్వుతూ.

విదేశాలలో ఎంతో మంది తెల్లతోలు ఆడవాళ్ళతో స్నేహం అయిఉంటుంది అతనికి. అయినా తన బంగారం రంగు ఒంటి ముందు వాళ్ళ తెల్ల రంగు ఏపాటిది! శేఖర్ పొద్దున్నకి వస్తాడు. బహుశా ఏడు గంటలకల్లా రావచ్చని మామయ్య చెప్పాడు. తను ఆరుగంటలకల్లా నిద్రలేవాలి. బీరువా తెరిచి పొద్దున్న కట్టుకోవలసిన చీర, జాకెట్టు తీసి విడిగా పెట్టుకుంది. అయిదున్నరకి అలారం పెట్టింది. దీపం ఆర్పేసి పడుకుంది నిద్రపట్టలేదు.

శేఖర్ పెళ్ళి విషయంతో తనేమీ జోక్యం కల్పించుకోనని మామయ్య నాన్నకి చెప్పాడు. శేఖర్ నిన్ను పెళ్ళి చేసుకునేట్లు చెయ్యడం నీ బాధ్యత అని తన తండ్రి చెప్పాడు. తను నవ్వుతూ తలఊపింది.

తను తలుచుకుంటే శేఖర్ తన దాసుడుకాడూ! కళ్ళు చిట్లించి ఒకసారి చిన్నగా నవ్వితే ఆ నవ్వుకి అతను కరిగిపోడూ!

అవును. తను బజారుకి వెళ్ళినపుడు, సినిమాలకి వెళ్ళినపుడు మొగాళ్ళు నిలబడిపోయి, కళ్ళప్పగించి తనని చూడడం తను ఎన్నిసార్లో గమనించింది, తిరిగి చూసుకుంటూ వెళతారు తనని, అంతెందుకు పక్కింటి ఆయన కొత్తగా పెళ్ళయి భార్యని కాపరానికి తెచ్చుకున్న మనిషి! అతని భార్య బి.ఏ పాసయింది, చాలా అందమైన మనిషి. నాజూకుగా ముస్తాబు చేసుకుంటుంది. ఒకరోజు ఆమెతో మాట్లాడటానికి తను వాళ్ళ ఇంటికి వెళితే ఆమె ఇంట్లో లేదు; ఆయన తనని వెళ్ళనివ్వలేదు. ఏదో మాట్లాడుతూ కూర్చోపెట్టి, ఏదో వంకతో తన చేతి వేళ్ళు ముట్టుకోవడం తన దగ్గరికి రావడం, తనని కళ్ళతో జుర్రుకోవడం - తలుచుకుంటే నవ్వు వస్తోంది. ప్రసాద్ బొంబాయిలో పుట్టి, బొంబాయిలో పెరిగాడు కదా ఎంతమంది అందమైన ఆడవాళ్ళని చూసి ఉంటాడు! అతనెందుకు రోజంతా తన వెనకే ఉంటాడు! తనే గదిలోకి వెళితే ఆ గదిలోకి ఏదో వంక పెట్టుకుని వస్తాడు! తనతో సినిమాకి రమ్మని టెన్నిస్ ఆడడానికి రమ్మనీ వేపుకు తింటాడు. తన చీర కొంగు కనపడితే చాలు ఎందుకు పరుగెత్తుకు వస్తాడు? శేఖర్ మాత్రం మొగాడు కాడా! అతను మాత్రం తనని చూసి మురిసిపోడా! ఇలా ఆలోచిస్తూ నిద్రపోయింది పద్మ.

పద్మ నిద్రలోంచి చటుక్కున లేచి కళ్ళు పెద్దవి చేసి చీకట్లోకి తీక్షణంగా చూసింది. ఏమీ కనిపించలేదు. తలుపు పక్కన దీపం స్విచ్ ఉంది. స్విచ్ నొక్కగానే క్లిక్ మన్న శబ్దం వినిపించిందిగాని దీపం వెలగలేదు పద్మకి భయం వేసింది. దీపం ఎందుకు వెలగలేదు! బల్బు చెడిపోయి ఉండవచ్చు. స్విచ్‌లో లోపం ఉండవచ్చు కాని ఆ గదిలో ఆమె ఇంకో క్షణం కూడా ఉండదలచుకోలేదు.

తలుపు వైపు వెళ్ళింది. ఎవరో తనని రాసుకుంటూ వెళ్ళినట్లు అనిపించింది. గాలి కావచ్చు. తలుపు గడియ తీసి లాగింది. తలుపు రాలేదు. మరింత గట్టిగా లాగింది. అయినా తెరుచుకోలేదు. తలుపు బిగుసుకుపోయిందా! మరిచిపోయి అవతలవైపు ఎవరయినా గడియ పెట్టారా! ఇంకోసారి తలుపు వైపు లాగి చూసింది. ప్రయోజనం లేకపోయింది. ముచ్చెమటలు పోస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. నిలబడ లేకుండా ఉంది. "తలుపు! తలుపు!" అని పెద్ద కేక పెట్టింది.

పక్క గదిలో పడుకున్న భారతికి ఆ కేక వినిపించింది. అప్పుడే పడుతున్న నిద్రలోంచి మేల్కొన్నది ఎవరు కేక వేశారో ఎందుకు కేక పెట్టారో ఊహించలేక నిముషం సేపు మంచం మీద కూర్చున్నది. పక్క గదిలో పద్మ పడుకున్నది. కేక ఆ గదిలోంచి వినబడ్డది. పద్మే కేక పెట్టి ఉండాలి అనుకుని మంచం మీద నుంచి ఒక దూకు దూకి తలుపు తెరవబోయింది. రాలేదు మొహం చిట్లించి మళ్ళీ లాగింది తెరుచుకోలేదు. చటుక్కున వెనక్కి తిరిగి కామరాజు గదికీ, తన మధ్యనున్న తలుపు తీసి, కామరాజు గదిలోకి పరిగెత్తి, ఆ గది తలుపు గడియ తీసి లాగింది. ఆ తలుపూ తెరుచుకోలేదు.

కామరాజు సుఖంగా నిద్రపోతున్నాడు. నిద్ర మందు తీసుకోవడం వల్ల పద్మ కేకలు గాని, భారతి చేస్తున్న చప్పుడు కాని ఆయనకి వినపించలేదు..

తన గది తలుపూ, కామరాజు గది తలుపూ కూడా ఎవరో బయట గడియపెట్టి ఉండాలి. అందుకే రావడం లేదు. కామరాజు గదిలో బెడ్‌రూం దీపం వెలగడం లేదు. భారతి మంచం దగ్గిరకి జరిగి స్విచ్ నొక్కింది. దీపం వెలగలేదు. దీపం చెడిపోయిందేమోననుకుని గోడకున్న స్విచ్ నొక్కింది. ఆ దీపమూ వెలగలేదు తన గదిలోకి పరిగెత్తి స్విచ్ వేసింది. ఆ దీపమూ వెలగలేదు.

చెవులు చిల్లులు పడేటట్లు పద్మ కేకలు ఇంకా వినబడుతున్నాయి. తనూ అరవాలనుకున్నది. గొంతు చించుకుని పొలికేకలు పెట్టాలనిపించింది. కామరాజు నిద్రలేస్తాడు. అసలే గుండె జబ్బుతో ఉన్న ఆ పెద్ద మనిషి దడుసుకుంటే గుండె ఆగిపోవచ్చు. తను ముందు తన పేషెంటు విషయం ఆలోచించాలి.

తెల్లారితే ఎవరో ఒకరు తలుపు తీస్తారు. అంతవరకూ ఓపిగ్గా కాచుకుని కూర్చోవడమే మంచిది. కాని పాపం పద్మగతేం కాను! ఏం చూసి భయపడిందో! లేక ఏదైనా ప్రమాదంలో ఉందా? లేకపోతే ఈ దీపాలు పోవడం ఏమిటి? తలుపులు బయట గడియలు పెట్టటమేమిటి? తనేం చెయ్యాలి ఇప్పుడు?

## 11

రాజారాం తొమ్మిది గంటలకల్లా భోజనం చేసి, సిగరెట్ వెలిగించి తోటలోకి వెళ్ళడానికి తలుపు తెరిచాడు.

"ఎక్కడికి ఇంత రాత్రివేళ?" అడిగింది సావిత్రి.

రాజారాం సావిత్రిని చూసి, నవ్వి "ఈవేళ మొదటి ప్రయత్నం" అన్నాడు

"అంటే - అందరూ నిద్రపోయిన తర్వాత ఇంట్లో ప్రవేశిస్తావా?" అడిగింది.

అతను తల ఊపాడు.

"జాగ్రత్త సుమా! పట్టుబడితే -"

"పట్టుబడను." అన్నాడు రాజారాం ధీమాగా తోటలోకి వెళ్ళిపోయాడు. తోటలో పచార్లు చేస్తూ గంట గడిపాడు. తర్వాత వాకిలి గుమ్మం దగ్గరికి వెళ్ళి, వసారాకి ఎదురుగా ఉన్న క్రోటన్ల వెనక నక్కి నిలుచున్నాడు.

దాదాపు పదకొండు గంటలు కావస్తున్నది. వాకిలి తలుపు వేయడానికి కొత్తగా వచ్చిన మునెయ్య తలుపు దగ్గిరకి వచ్చి ఒకసారి బయటికి తొంగి చూసి, హాల్లో దీపం ఆర్పేసి, తలుపు వెయ్యకుండానే ఏదో పనిమీద లోపలికి వెళ్ళిపోయాడు. రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది రాజారాంకి. చటుక్కున పొద వెనక నుంచి కదిలాడు. క్షణంలో హాల్లో ప్రవేశించి ఒక పెద్ద సోఫా కింద దాక్కున్నాడు పది నిమిషాల తర్వాత మునెయ్య హాల్లోకి తిరిగి వచ్చి తలుపు మూసి లోపల గడియ పెట్టి వెళ్ళిపోయాడు.

రాజారాం అరగంటసేపు ఆ సోఫా కిందే దాక్కున్నాడు. ఇంట్లో అందరూ నిద్రపోవాలి. తర్వాతే తను అక్కణ్ణించి కదలవచ్చు. చాలా ఓపికతో కాచుకున్నాడు ఎక్కడా చడీ చప్పుడూ లేదు. దీపాలన్నీ ఆర్పేశారు రాజారాం చప్పుడు చేయకుండా సోఫా కిందనుంచి లేచాడు. గోడలకి ఆనించి బీరువాలున్నాయి. ఆ బీరువాను ఆనుకుని నెమ్మదిగా జరిగాడు.

ఏ గది? పదేళ్ళ క్రితం తను ఆ ఇంట్లోకి వచ్చినపుడు ఈ సోఫాలు, ఈ తెరలు లేవు ఇన్ని తలుపులులేవు. కొత్తగా కొన్ని గోడలు గదులు కట్టించారు. పట్టపగలు ఇంట్లోకి వచ్చి ఆ గది ఏదో గుర్తుపెట్టుకోవడానికి అవకాశం లేకపోయింది. హాల్లోంచి నడవలోకి వెళ్ళాడు. కటిక చీకటి అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు.

మేడమీదకి వెళ్ళాలి. హాలు పక్క గదిలో మెట్లు ఉన్నాయి. రాజారాంకి అది తెలుసు. అటు నడిచాడు. మెట్లు ఎక్కి గోడపక్కన నక్కి నిలుచున్నాడు. ఎప్పుడు ఎవరు ఏ గదిలోంచి వస్తారో! తను మళ్ళీ పట్టుపడ్డాడా మళ్ళీ జైలు. కనీసం ఇంకో రెండేళ్ళు. కామరాజు

గది అది. ఆ వేళ తనని ఆ డ్రయివర్ తీసుకెళ్ళింది ఆ గదిలోకే. బహుశా ఆ గదికి రెండో గది అయిఉండాలి. ఆ గదిలో ఎవరున్నారో! ఎవరూ లేకపోతే ఎంత బావుంటుంది! ఆ గది తలుపు దగ్గిరకి వెళ్ళి తలుపు సందుకి చెవి ఆనించి లోపల ఎవరయినా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఏమీ వినబడలేదు. తలుపు తోశాడు. తెరుచుకోలేదు. బయట గడియ పెట్టి ఉంది. అంటే లోపల ఎవరూ లేరన్నమాట. గడియ లాగి తలుపు నెమ్మదిగా తోశాడు కాని తెరుచుకోలేదు! రాజారాం ఆశ్చర్యంతో నిమిషం సేపు ఆలోచిస్తూ ఉండిపోయి, తర్వాత జేబులోంచి రెండు పనిముట్లు తీశాడు. సన్నని కడ్డీలాటిది తలుపుకీ, తలుపుకి మధ్య నున్న సందులో దూర్చాడు. సందు కొంచెం ఎక్కువయింది. కొంచెం లావుగా ఉన్న ఇంకో కడ్డీ ఆ సందులో ఇరికించాడు ఆ రెండో కడ్డీ చివర్న వున్న మీట నాలుగుసార్లు నొక్కాడు. అది నిజానికి కడ్డీ కాదు - గొట్టం. ఆ గొట్టంలో ఆసిడ్ ఉంది. ఆ ఆసిడ్ లోపల గడియ బిగించే కొక్కెం మీద పడగానే కొక్కెం కరిగిపోయింది. రెండు కడ్డీలు బయటికి తీసేసి, రాజారాం తలుపు తోశాడు. తలుపు తెరుచుకుంది. చప్పుడు చెయ్యకుండా గదిలో ప్రవేశించాడు. మోకాళ్ళ మీద ఒంగి చీకట్లోనే నేల పరీక్ష చెయ్యడం ప్రారంభించాడు.

మంచం మీద ఎవరో కదిలినట్లు అలికిడి కాగానే చటుక్కున లేచి నిలబడ్డాడు. ఆ చీకట్లో కనీ కనిపించకుండా కనిపిస్తోంది మంచం మీద ఆకారం. కదిలినప్పుడు చేతులు గాజులు గల గల మన్నాయి. ఎవరో స్త్రీ. అంతవరకు నయమే. రాజారాం మళ్ళీ నేల మీదకి దృష్టి పోనిచ్చి వెతకడం ప్రారంభించాడు అరగంట అయిన తర్వాత తను అన్వేషిస్తున్నది ఆ గదిలో లేదని, ఆ గది కాదని నిశ్చయించుకుని విసుగ్గా లేచి నిలుచున్నాడు. నిలుచుంటున్నపుడు జేబులోంచి ఒక కడ్డీ కిందపడి ఖంగుమని చప్పుడు అయింది.

రాజారాం రాతి బొమ్మలా నిలబడిపోయాడు పక్క మీద పడుకున్న స్త్రీ లేస్తుందేమోనని భయపడ్డాడు. ఆమే కదిలింది. కాని లేవలేదు. దుప్పటి లాగి కప్పుకుని పడుకుంది. రాజారాం బిగపట్టిన ఊపిరి నెమ్మదిగా విడుస్తూ కిందపడ్డ కడ్డీకోసం వెతకడం ప్రారంభించాడు. మంచం కిందకి పోయివుంటుందనుకుని మోకాళ్ళ మీద మంచం కిందకి జరిగి కడ్డీ తీసుకుని వస్తుండగా అది నేలకి తగిలి మళ్ళీ ఖంగుమని చప్పుడయింది.

మంచం మీద పడుకున్న మనిషి లేచి కూర్చున్నది. రాజారాం మంచం కిందకి జరిగాడు. మంచం మీద మనిషి లేచి, తలుపు దగ్గిరకి వెళ్ళి స్విచ్ నొక్కింది. కనిపించకుండా ఉండటానికి రాజారాం మంచం కింద మధ్యకి జరిగాడు. దీపం వెలగలేదు నిద్రలేచిన మనిషి తలుపు గడియలాగి తలుపు తెరుస్తోంది. ఎవర్నయినా పిలుస్తుందేమో! రాజారాం పారిపోవడానికి మంచం కిందనుంచి వచ్చి తలుపు వేపు జరిగాడు. ఆ చీకట్లో చూసుకోక ఆ మనిషికి మరీ దగ్గరగా వెళ్ళాడు. ఇద్దరూ ఒకర్ని రాసుకున్నంత పనయింది.

## 12

దీపం ఆర్పేసి పడుకున్నాడే కాని ప్రసాద్‌కి నిద్ర పట్టలేదు. పద్మిని గురించి ఆలోచిస్తున్నాడు. ఆ యువతిని చూసీ చూడ్డంతోనే అతను ఆమె దాసుడయిపోయాడు. తొలిచూపు ప్రేమ అంటారు అనుకున్నాడు. పద్మ దృష్టి తనమీద లేదనీ, శేఖర్ ఎప్పుడు వస్తాడా అని కాచుకున్నదనీ తెలుసు. విదేశాలు తిరిగి వచ్చిన శేఖర్ పద్మని తృణీకరిస్తాడేమోనని అతని ఆశ. మెలకువగా ఉండే కలలు కంటున్నాడు ప్రసాద్. ఉన్నట్లుండి చెవులు చిల్లులు పడేటట్లు కేక, "తలుపు! తలుపు!" అని అరవడం వినిపించాయి. ఎవరు! ఎక్కణ్ణించి! ప్రసాద్‌కి వెంటనే తెలిసిపోయింది. పద్మ, తన పద్మ, ఏం అపాయంలో ఉందో! పక్క మీద నుంచి ఒక గంతేసి తలుపు తోసాడు. తలుపు తెరుచుకోలేదు. ఆశ్చర్యంతో దీపం మీద స్విచ్ వేశాడు. దీపం వెలగలేదు. ఏమిటిది! చెవులు గింగురుమంటున్నాయి పద్మ కేకలతో. తను తొందరపడి మతి పోగొట్టుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. వెనక్కి తిరిగి పరుపు కిందనుంచి టార్చిలైటు తీశాడు. టార్చి వెలుగులో తలుపు పరీక్షగా చూసి లాగాడు. తెరచుకోలేదు తలుపుకి దూరంగా వెళ్ళి ఒక్క పరుగున వచ్చి రెండు కాళ్ళతో బలంగా తన్నాడు. తలుపు కరకరమన్నది. మళ్ళీ వెనక్కి వెళ్ళి అదే విధంగా తన్నాడు. ఫెళఫెళమంటూ తలుపు విరిగి కిందపడ్డది. గదిలోంచి బయటికి పరిగెత్తాడు.

నడవాలోకి వెళ్ళి రెండే మేడమెట్లు ఒకసారి గబగబా ఎక్కుతున్నాడు. చేతిలో టార్చి వెలుగుతోంది, ఇంకో ఆరుమెట్లు ఎక్కాలి. అప్పుడు తలపైకెత్తి చూశాడు. ఆఖరు మెట్టుమీద గోడకి ఆనుకుని ఎవరో నిలుచున్నారు.

టార్చి వెలుగులో అతనికి కనిపించిన ఆకారం భయంకరంగా ఉంది. ఆ టార్చి వెలుగు తప్ప ఇంకే వెలుగూ లేదు. అక్కడ వలయాకారంలో టార్చి వెలుగు అతనిమీద పడుతోంది. దాదాపు ఏడడుగుల పొడుగు, రెండు చేతులూ పైకెత్తి పెట్టాడు. చేతులకి వేళ్ళులేవు. మొండి చేతులు. తల ఉంది కాని మొహం లేదు. మెడవరకూ నల్లని గుబురు జుట్టు. ఆ జుట్టులో రెండు కళ్ళు, వాటి చుట్టూ వలయాకారంలో మెరుస్తున్న గీతలని బట్టి అవి కళ్ళని తెలుస్తోంది. పెద్ద కడుపు. వెలుగు కాళ్ళవరకూ పడడం లేనందువల్ల కాళ్ళు నేలమీద అని ఉన్నదీ లేనిదీ తెలియడంలేదు.

ప్రసాద్ ఆగిపోయి వినీవినిపించని స్వరంలో "ఎవరు నువ్వు"? అని అడిగాడు. ఆకారం జవాబు చెప్పలేదు. రెండు చేతులూ ఊపింది. ప్రసాద్ పిరికివాడు కాడు కాని మనిషో దెయ్యమో తెలియలేదు. పద్మ ఏదో ఆపదలో ఉంది. వెనక్కి తిరిగిపోలేదు. ముందుకి వెళ్ళడానికి ధైర్యం చాలలేదు.

ఆ ఆకారం మీదకి టార్చి విసిరేశాడు. టార్చి గోడకి తగిలి కింద పడిపోయింది. కటిక చీకటి. ఆ చీకట్లో ఆ ఆకారం కళ్ళచుట్టూ మెరుస్తున్నవి గీతలు భయంకరంగా ఉన్నాయి. అది మెట్లు దిగి తన మీదకి వస్తోంది. ప్రసాద్ కదలలేదు. గుండె రాయి చేసుకున్నాడు పద్మకి ప్రమాదం తప్పిందని సంతోషించాడు. అది తనకి బాగా దగ్గరికి వచ్చాక పిడికిలి బిగించి చెయ్యి ఎత్తాడు ప్రసాద్. కాని తన చెయ్యి కదిలేలోగా ఆ ఆకారం తన చేతినీ, మెడనీ పట్టుకుని ఒక్క తోపు తోసింది. కింద పడ్డాడు.

రాజారాం పద్మ గదిలోంచి బయటికి రాగానే ఆగిపోవడానికి కారణం ప్రసాద్ చూసిన ఆ వికృతరూపాన్ని అతనూ చూడడమే. ప్రసాద్ వేసిన టార్చి వెలుగులో రాజారాం మరింత దగ్గిర్నించి చూశాడు ఆ భీకరాకారాన్ని. చూడగానే గుండె ఆగిపోయినంత పనయింది అతనికి. కాలు కదల్చలేక నిలబడిపోయాడూ. కళ్ళప్పగించి చూశాడు. తను పారిపోవాలంటే మెట్లు దిగాలి. మెట్ల మీద ఆ ఆకారం ఉంది. ఎలా వెళ్ళడం!

"ఎవరు నువ్వు" అన్న ప్రసాద్ ప్రశ్న వినపడగానే కొంచెం ధైర్యం వచ్చింది. తను ఒక్కడే కాదు, ఇంకో మనిషి ఉన్నాడు. ఆ భీకరాకారం తన మీదకి వస్తుందని భయపడనవసరంలేదు. తను కదలకపోతే తనని చూడదు.

ప్రసాద్ టార్చి విసిరేశాడు. టార్చి పగిలిపోయింది ఉన్న వెలుగు కాస్తా పోయింది. ఆ రూపం కళ్ళచుట్టూ మెరుస్తున్న గీతలు మాత్రం కనిపిస్తున్నాయి. రాజారాం గజగజవణుకుతున్నాడు.

ఆ ఆకారం మెట్లు దిగుతోంది. వెళ్ళిపోతోంది. తను పారిపోవచ్చు రాజారాం మెట్లదగ్గరకి వెళ్ళాడు. ప్రసాద్ ని మెట్లమీదనుంచి కిందకి తొయ్యడం అస్పష్టంగా కనిపించింది అతనికి. తర్వాత ఆ ఆకారం మెట్లు దిగి కిందకి వెళ్ళిపోయింది.

రాజారాం మెట్లమీద ఆగిపోయాడు. మెట్లు దిగి ఆ చీకట్లో కిందకి వెళ్ళేందుకు ధైర్యంలేకపోయింది. ఆ చీకట్లో ఏమూలో పొంచి ఉంటే ఆ ఆకారం? వెనక్కి తిరిగాడు. అవతల చిన్న బాల్కనీ ఉంది. బాల్కనీలోంచి కిందకి దూకేందుకు పరిగెత్తాడు.

## 13

మెట్లమీదనుంచి కిందకి దొర్లిపడుతూ ప్రసాద్ పెట్టిన పొలికేకకి కామరాజు కూడా ఉలిక్కిపడి నిద్రలేచాడు. వెంటనే మంచం పక్కనున్న టేబుల్ లైట్ స్విచ్ నొక్కి వెలగకపోయేసరికి "భారతీ!" అని పిలిచాడు. ప్రసాద్ పెట్టిన కేక విని భయంతో గజగజవణికిపోతున్న భారతి అతికష్టం మీద "ఆ!" అనగలిగింది.

"దీపం వెలిగించు. ఎవరు కేక పెట్టారు?" అడిగాడు కామరాజు.

"ఎవరో కిందనుంచి కేకేట్టారు. దీపాలు వెలగడం లేదు" అన్నది భారతి మంచం దగ్గరికి వచ్చి.

ఇంకో మనిషి మాట్లాడడం వింటేనే చాలనిపిస్తోంది ఆమెకి.

"దీపాలు ఎందుకు వెలగడం లేదు? తలుపు తీసి హాల్లోకి వెళ్ళి రత్నయ్యని కేకెయ్యి"

రత్నయ్య పనిలోలేడని, మునెయ్య అనే అతను ఉన్నాడనీ చెప్పాలనిపించింది భారతికి. ఎవరయితేనే అనుకుని "తలుపు రావడం లేదు" అన్నది.

"ఎందుకు రావడం లేదు?" అడిగాడు కామరాజు కూర్చుంటూ.

"నాకు తెలియదు"

"ఆ బల్ల సొరుగులో టార్చి ఉన్నది ఇలాతే."

భారతి కదలలేదు.

"అక్కడే నీ కుడివైపు రెండడుగులు వేస్తే బల్ల ఉంది."

"నాకు భయం వేస్తోంది."

కామరాజు చిన్నగా నవ్వాడు. "పిచ్చిపిల్లా ఎవరో మెట్లమీద నుంచి పడివుంటారు. ఈ మాత్రానికి భయం ఎందుకు!" అంటూ తనే లేచి వెళ్ళి టార్చి తీసుకుని వెలిగించాడు.

"అదేమిటి! అలా నీ మొహం పాలిపోయిందేమిటి!" అడిగాడు కామరాజు.

"పక్క గదిలోంచి పద్మ పొలికేకలు పెట్టింది."

"దడుచుకున్నదేమో! తలుపు ఎందుకు తెరుచుకోలేదో చూస్తానుండు" అని కామరాజు తలుపు లాగి చూశాడు. ఎంత బలంగా లాగినా ప్రయోజనం లేకపోయింది.

"ఎవరో బైట గడియపెట్టారు" అన్నాడు కామరాజు నిట్టూరుస్తూ.

భారతి తల ఊపింది. కామరాజు మొహం తీక్షణమైంది. టెలిఫోన్ రిసీవర్ తీసాడు. క్లిక్ మనలేదు.

"టెలిఫోన్ కూడా పనిచెయ్యడం లేదు" అన్నాడు కామరాజు.

భారతి మాట్లాడలేదు. కామరాజు కిటికీ దగ్గరికి వెళ్ళి బయటికి తొంగి చూశాడు! చీకట్లో చెట్ల ఆకారాలు, ఆకాశం మీద నక్షత్రాలు కనిపించాయి. "కొత్తగా వచ్చిన తోటమాలి పేరేమిటి?" అడిగాడు.

"శేషయ్య."

"శేషయ్యా" గట్టిగా కేక పెట్టాడు కామరాజు.

శేషయ్య పలకలేదు.

"మీరు ఊరుకోండి నేను పిలుస్తాను" అని భారతి గొంతు చీల్చుకుంటూ శేషయ్యని పిలిచింది.

"అమ్మగారూ!" అంటూ ఆ గది తలుపు దగ్గర నిలబడ్డాడు శేషయ్య.

కామరాజూ, భారతి తలుపువేపు చూశారు. టార్చి వెలుగులో తలుపు తెరిచి ఉండడం, శేషయ్య గుమ్మంలో నిలబడి ఉండడం కనిపించింది.

ఈ అర్ధరాత్రి నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?" అడిగాడు కామరాజు కోపంగా.

"ఇంట్లోనించి వచ్చిన కేకలు విని నేనూ, ముద్దబ్బాయి పరిగెత్తుకు వచ్చాము. వాకిలి తలుపు తెరిచేవుంది. ఇల్లంతా చీకటిగా ఉంది. ముద్దబ్బాయి వెళ్ళి లాంతరు తెచ్చాడు. మెట్లకింద చిన్నయ్యగారు రక్తం మడుగులో పడి ఉన్నారు" చెప్పాడు శేషయ్య.

"ఏ చిన్నయ్యగారు!" అడుగుతూ కామరాజు ముందుకు నడిచాడు.

"ప్రసాద్ అయ్యగారు. అందరూ గదుల్లోంచి తలుపులు రావడం లేదనీ, బయట ఎవరో గడియపెట్టారనీ కేకలు వేశారు. అన్ని గదుల తలుపులూ తెరిచాను" అంటూ శేషయ్య, కామరాజు, భారతీల వెనకాలే వెళ్ళాడు.

"మునెయ్య, దాసీది, వంటమనిషి ఏమయ్యారు?" అడిగాడు కామరాజు శేషయ్యని.

"మునెయ్య తన గది తలుపు బద్దలు కొట్టి బయటకి వచ్చాడండి"అన్నాడు శేషయ్య.

ముగ్గురూ మేడమెట్లు దిగారు. రక్తం మడుగులో ఉన్న ప్రసాద్‌ని లాంతరు మసక వెలుగులో చూసి, కామరాజు నిశ్చేష్టుడై మెట్లమీద చతికిలపడ్డాడు. ప్రసాద్ తండ్రి లింగమూర్తి, కొడుకు తల నెమ్మదిగా ఎత్తి ఒళ్ళో పెట్టుకున్నాడు. అతని తల్లి భానుమతి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

భారతి ప్రసాద్ దగ్గరికి వెళ్ళి చెయ్యి పట్టుకుని నాడి చూసి, తరువాత గాయం పరీక్ష చేసి "ప్రమాదం ఏమీ లేదు. గాయం భుజం మీద తగిలింది. రక్తం చాలా కారింది అంతే! ఎవరైనా నా గదిలోకి వెళ్ళి నా సంచి తీసుకు రండి" అన్నది.

ముద్దబాయి పరిగెత్తుకు వెళ్ళి నిమిషంలో సంచి తీసుకొచ్చాడు.

భారతి ప్రసాద్ భుజానికి కట్టుకట్టింది. వేడిపాలు తెమ్మని వంటమనిషికి చెప్పింది. ఒంటిగా వెళ్ళలేనన్నది వంట మనిషి. ముద్దబ్బాయి తోడు వెళ్ళాడు.

"ఎవడో దొంగ వచ్చివుంటాడు, అందరి గదుల తలుపులూ బయట గడియలు పెట్టి నింపాదిగా ఇల్లంతా దోచుకోవాలనుకున్నాడు" అన్నాడు వైకుంఠరావు.

భారతి ప్రసాద్ నోట్లో చెంచాతో వేడిపాలు పోసి సగం గ్లాసు పాలు తాగించింది. కాసేపటికి అతను కళ్ళు తెరిచాడు, ఎవరినీ గుర్తుపట్టనట్లు శూన్యంలోకి చూచాడు. తలొకరూ తలో ప్రశ్న వేశారు కాని ప్రసాద్ జవాబు చెప్పలేదు. అయిదు నిముషాల తర్వాత లేచి కూర్చుని మెట్ల మీదకి తీక్షణంగా చూశాడు చీకటిగా ఉంది. ఏమీ కనిపించలేదు.

"ఏమిటి చూస్తున్నావు!" అడిగాడు లింగమూర్తి.

"అసలు జరిగిందేమిటో చెప్పవయ్యా" అన్నాడు వైకుంఠరావు.

ప్రసాద్ పెదిమలు తడిచేసుకుని చెప్పాడు. అతను పూర్తిగా చెప్పేంతవరకూ అందరూ నిశ్శబ్దంగా విన్నారు. తరువాత తలొకరూ తలో అభిప్రాయం వెలిబుచ్చారు.

"ఎవడో దొంగ అయిఉండాలి."

"మంచి భారీ మనిషి అయివుంటాడు."

"నీ టార్చి వెలుగుతో వాడి కళ్ళు మెరిసివుంటాయి."

"జుట్టు పొడుగ్గా పెంచుకుని గిరజాలు మొహం మీద వేసుకునుంటాడు."

ప్రసాద్ తల విదిలించాడు.

"ఏమిటి తల విదిలిస్తున్నావు!" అడిగాడు కామరాజు.

"దొంగకాడు" అన్నాడు ప్రసాద్.

"దొంగకాకపోతే మరెవరు."

"అసలు మనిషే కాదు."

"జంతువా?" అడిగాడు వైకుంఠరావు.

" మనిషీ కాదు, జంతువూ కాదు. దెయ్యం!" అన్నాడూ ప్రసాద్.

"షాక్ అయ్యావు. చీకట్లో అటువంటి వికృతాకారాన్ని చూస్తే అలాగే భ్రాంతి కలుగుతుంది. పొద్దున్నే పోలీసులకు కబురు చేస్తాను" అన్నాడు కామరాజు లేచి నిలుచుంటూ.

"పోలీసులు ఏం చేస్తారు? మనిషయితేగా? టార్చి వెలుగులో స్పష్టంగా చూశాను మనిషి కావడానికి ఏ మాత్రం వీలు లేదు" అన్నాడు ప్రసాద్.

"మనిషి కాదని అంత స్పష్టంగా ఎలా చెప్పగలవు? " అడిగాడు వైకుంఠరావు.

ప్రసాద్ కళ్ళు నులుపుకుని చేత్తో నుదురురాసుకుంటూ "ఉండండి జ్ఞాపకం చేసుకోనివ్వండి" అన్నాడు.

అందరూ ప్రసాద్ ఏం చెపుతాడో అని ఊపిరి బిగపట్టుక్కూర్చున్నారు.

"టార్చి వెలుగు పొట్టమీద పడ్డది. అప్పుడు స్పష్టంగా చూశాను. బొడ్డులేదు."

బొడ్డు లేదా! బొడ్డులేని మనిషి ఎక్కడుంటాడు! తల్లి కడుపులోంచి పుట్టిన ప్రతి మనిషికీ బొడ్డు ఉండి తీరాలి. బొడ్డు లేకపోతే మనిషి కాడు. ఒకళ్ళ మొహం ఒకరు చూసుకున్నారు. అందరూ భయపడుతూ మూల మూలల్లో చూశారు. దొంగయితే పట్టుబడే ప్రమాదం వస్తే తప్ప దౌర్జన్యం చెయ్యడు. కాని ఆ ఆకారందౌర్జన్యంచేసింది. దొంగకాడేమో! మనిషీ కాదేమో! భయంతో అందరూ ఒణికి పోయారు.

## 14

"నాకు దెయ్యాలలో నమ్మకంలేదు. చదువుకున్నవాడివి. పట్నంలో పెరిగినవాడివి. నీకిలాటి పిచ్చి నమ్మకం ఎలా కలిగిందో ఊహించలేకుండా ఉన్నాను" అన్నాడు శేఖర్.

ప్రసాద్ బలహీనంగా నవ్వాడు. "ఇంతకుముందు నాకూ నమ్మకంలేదు. కాని రాత్రి ఆ దృశ్యం చూశాక -"

"ఎవరో మనిషే అలా వేషం వేసుకుని ఉండవచ్చు. ఇంకాసేపట్లో పోలీసులు వస్తారు తేలుతుంది," అని అందర్నీ ఒకసారి చూశాడు శేఖర్.

శేఖర్ ఆవేళ పొద్దున్న విమానంలో దిగాడు. ఎనిమిది గంటలకల్లా ఇంటికి చేరుకున్నాడు. విమానాశ్రయానికి లింగమూర్తి వెళ్ళాడు. కారులో వస్తూ తోవలో రాత్రి జరిగిన విషయాలన్నీ వివరంగా శేఖర్‌కి చెప్పాడు. ఇంటికి రాగానే శేఖర్ తండ్రిని పలకరించి తర్వాత ప్రసాద్‌ని చూడటానికి వెళ్ళాడు.

పద్మ, భానుమతి, లింగమూర్తి, వైకుంఠరావు, భారతీ అక్కడ ఉన్నారు.

"నేను వాదించదలచుకోలేదు" అని వెనక్కి జారగిలబడ్డాడు ప్రసాద్

పోలీసులు వచ్చారని మునెయ్య వచ్చి చెప్పగానే శేఖర్ లేచి హాల్లోకి వెళ్ళాడు.

రాత్రి జరిగిన సంఘటనలన్నీ వివరంగా చెప్పాడు కామరాజు పోలీస్ ఇన్స్పెక్టరుకి.

"ఇంట్లో నౌకర్లు ఎవరో చేసి ఉండవచ్చు. దర్యాప్తు చేస్తాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

కామరాజు మొహం చిట్లించి "నౌకర్లు ఎవరో చేసి ఉంటారని నాకూ అనుమానం కలిగింది. కాని కారణం కనిపించదు. ఒక్క చీపురు పుల్లకూడా పోలేదు" అన్నాడు.

"అవకాశం ఉండి ఉండదు" జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అయినా ఎత్తుకుపోయి, అమ్మి డబ్బు చేసుకోడానికి ఈ ఇంట్లో నగలు లేవు. డబ్బేమైనా ఉంటే అది నా దగ్గర. నా దిండుకింద పర్సులో ఉంటుంది. నా గదిలోకి రావడానికి ఆ దొంగ ప్రయత్నించలేదు"

ఇన్‌స్పెక్టర్ తలవూపి "దర్యాప్తు చేస్తేకాని తెలియదు" అని సార్జంటు వైపు తిరిగి "ఇల్లంతా పరీక్ష చెయ్యి. ముఖ్యంగా మెట్లమీద, తలుపు గడియలమీద వేలిముద్రకోసం ప్రయత్నించి ప్రయోజనం ఉండదనుకుంటాను. ఐనా ప్రయత్నించు. నౌకర్లందర్నీ నా దగ్గరకి పంపు" అన్నాడు. తర్వాత కామరాజు వైపు తిరిగి "దయచేసి నాకు తాత్కాలికంగా ఒక గది ఇవ్వగలరా?" అడిగాడు.

"హాలు పక్కనున్న గదికి తీసుకు వెళ్ళు" అన్నాడు కామరాజు మునయ్యతో.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోగానే "బొడ్డు లేని మనిషి గురించిన మర్మం త్వరలో బయటపడుతుంది చూసుకోండి!" అని నవ్వుతూ శేఖర్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

శేఖర్ అంత ధైర్యంగా ఎలా చెప్పగలిగాడు? ఇన్స్పెక్టర్ ఎంతవరకూ విజయం సాధిస్తాడు? రాజారాం కాకుండా ఇంకెవరో, దేనికోసమో ఆ బంగ్లాలో అన్వేషిస్తున్నారా? ఐతే ఏమిటది? తప్పదు..వచ్చేనెల వరకూ ఆగి తీరాల్సిందే.!

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..?
లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా?
వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library